## విదేశీ చందాదారులకు విన్నపం

విదేశాల్లో ఉన్న 'రచన' చందాదారులు తమ e-mail ID ని తెలియజేయవలసిందిగా పేరుపేరునా కోరుతున్నాము. చందా కాలపరిమితి పూర్తయిన వివరం తెలియజేయడానికి గానీ, పంపిన చెక్కులు అందినట్లు తెలియజెప్పడానికి కానీ వీలుగా ఈ విన్నపం!

RACHANA e-mail : **talpasai@rachana.net; rachanapatrika@hotmail.com; rachanapatrika@yahoo.com**

## రైల్వే బుక్‌స్టాల్స్‌లో 'రచన' కొనే పాఠకులకు ప్రత్యేక విన్నపం

ఇటీవల రైల్వే బడ్జెట్ సందర్భంగా కేంద్ర రైల్వే శాఖమంత్రిగారు రైల్వేస్టేషన్స్‌లో ఉన్న బుక్‌స్టాల్స్‌ను స్థానిక సంస్థలకో, స్థానిక నిరుద్యోగులకో అప్పజెప్తామన్నట్లు వార్తలు వచ్చేయి. ఇదే జరిగినప్పుడు ఇప్పటిలా రైల్వేస్టాల్స్‌లో 'రచన' కాపీలు లభ్యమవడం అనుమానమే! ఆ కారణంగా రైల్వే బుక్‌స్టాల్స్‌లో 'రచన' కొనుక్కునే పాఠకులు చందాదారులుగా చేరడం అనివార్యం అని గమనించవలసిందిగా కోరుతున్నాము.

## మనియార్డరు ద్వారా చందా పొడిగించే చందాదారులకు విన్నపం

ఇటీవల చాలా సందర్భాలలో ఎం.ఓ. ఫారమ్ మీద మాకు పోస్ట్‌మాన్ అందించే భాగంలో పంపినవారి చిరునామా లేకపోవడం వల్ల ఇబ్బంది కలుగుతోంది. మళ్ళీ ఆ ఎం.ఓ. పంపిన వారు ఉత్తరం రాస్తే గానీ అది ఎవరు పంపారో అర్థం కాని పరిస్థితి ఎదురవుతోంది. ఆ కారణంగా ఎం.ఓ. పంపేవారు తప్పనిసరిగా "Space for communication" అని ఉన్న భాగంలో తమ పూర్తి చిరునామా వ్రాయవలసిందిగా కోరుతున్నాము.

## రచన శాశ్వత నిధి

ఈ ప్రణాళికను సూచన ప్రాయంగా ప్రకటించగానే మంచి స్పందనే లభించింది. '**ఇది అనివార్యం - అత్య వసరం**' అన్న భావన రచనాభిమానులు వెలిబుచ్చారు.

దాదాపు అందరూ వెలిబుచ్చిన అభిప్రాయం - 'మీరు అన్న వంద రూపాయలు చాలా తక్కువ మొత్తం. ఎప్పటికి శాశ్వత నిధి లక్ష్యాన్ని సాధించగలరు?' - అని. ఈ ప్రణాళి కను ప్రకటించే సమయంలో మా మదిలో మెదిలిన ముఖ్యాంశం ఒకటే - రచనాభిమానులందరూ వారందించే '**సాయం**' ఎంతయినా పత్రికా నిర్వహణలో ఎంత ఎక్కువ మందిని పరోక్ష భాగస్వాములను చేయగలమన్నది! ఆ కారణంగా అందిన సూచనలను, సలహాలను దృష్టిలో ఉంచుకుని స్థూలంగా ఈక్రింది అంశాలను ప్రకటిస్తున్నాం:

- 'శాశ్వత నిధి'కి విరాళం అందించడానికి కనిష్ట పరిమితి రు. 200/- కాగా గరిష్ట పరిమితి అంటూ ఉండదు.
- తమ స్తోమతును, వీలును బట్టి ఎన్ని దఫాలుగానైనా 'శాశ్వత నిధి'కి విరాళం అందజేస్తూ ఉండవచ్చును.
- 'శాశ్వత నిధి'కి విరాళాలు పంపేటప్పుడు ఆ విషయం స్పష్టంగా తెలియజేయాలి.
- 'శాశ్వత నిధి' ప్రణాళిక క్రింద అందిన మొత్తాలను ఫిక్స్‌డ్ డిపాజిట్ క్రింద ఉంచడం జరుగుతుంది. కేవలం దాని మీద వడ్డీ రూపంలో లభించే మొత్తాన్ని మాత్రమే పత్రిక నిర్వహణా లోటును భర్తీచేయడానికి ఉపయోగించడం జరుగుతుంది.
- పత్రికను నెలా నెలా గతి తప్పకుండా ప్రచురిం చడానికి తగినంత 'శాశ్వత నిధి' ఏర్పడింది అన్న నమ్మకం కలిగాక ఈ ప్రణాళికను రద్దుచేయడం జరుగుతుంది.
- Cheques/DD's are to be drawn in favour of '**RACHANA**' payable at 'HYDERABAD'

'రచన' పత్రిక నిర్వహణలో పరోక్ష భాగస్వామ్యం స్వీకరించమని రచనాభిమానులను స్వాగతిస్తున్నాం!

**- సంపాదకుడు**

**సలహాదార్లు**

కాళీపట్నం రామారావు
కవన శర్మ
అత్తలూరి నరసింహారావు
వసుంధర
కోడూరి శ్రీరామమూర్తి
కేతు విశ్వనాథరెడ్డి
డా. ఎన్. సురేంద్ర
వై. రాంబాబు & శాయి
డా. డి.వి.ఆర్. పూషా





**మార్కెటింగ్**

శాండిల్య మార్కెటింగ్
5-4-670, నాంపల్లి స్టేషన్ రోడ్,
హైదరాబాద్-500001
ఫోన్:24614641, 24602491

**సంపాదకుడు**

వై.వి.యస్.ఆర్.యస్.తల్పశాయి

**అసోసియేట్ ఎడిటర్**

'హంసలేఖ'

*The Only Magazine Administered by Writers*


# బాల విహంగ వీక్షణ సంపుటి : 1311 పేజీలు

కొన్ని ప్రశ్నలకు సమాధానాలు ఉండవు.

ఈ ప్రాజెక్ట్ గురించి విన్న కొందరు మిత్రులు 'మీ కిలాంటి ఆలోచన ఎలా వచ్చింది?' అంటూ ఆరా తీశారు. ఈ ప్రశ్న కూడా సమాధానం లేని ప్రశ్నే!

'బాలానందంతోగానీ, బాలన్నయ్యతోగానీ మీ కెలాంటి సంబంధాలూ లేవు గదా – మరెందుకీ ప్రయత్నం చేస్తున్నట్టు?' – ఇది మరో సమాధానం లేని ప్రశ్న!

'ఫలితం ఎలా వున్నా మీ ఆలోచన గొప్పగా ఉంది. అది చాలు మాకు' అన్న వారూ ఉన్నారు.

'ఇదేమన్నా 'పెద్దబాలశిక్ష' గానీ, 'కాశీమజిలీ కథలు'గానీ అనుకుంటున్నారా – లక్షల్లో కాపీలు అమ్ముడుపోవడానికి' అని హెచ్చరించారు మరికొందరు.

'భారీ కొండను తలెత్తుకున్నారు. ఏమవుతుందోనని భయంగా ఉంది' అని వేదన చెందిన మిత్రులూ ఉన్నారు.

ఇంతకు రెండింతల మంది 'మంచి పని తలపెట్టారు. కానివ్వండి' అంటూ వెన్ను తట్టారు.

అన్నీ వినడమూ, వాటిలోని అనుసరణీయమైన విషయాలను గ్రహించి అనుకున్నది చేయడమూ అలవాటు నాకు. నాతో బాటుగా ఓ పదో, వంద మందో చేసిన పనికి అసంతృప్తి చెందకుండా ఉంటే చాలు – అదే లక్ష వరహాలు అనుకునే తత్వం నా గమనాన్ని ఎప్పుడూ నిర్దేశిస్తూ ఉంటుంది.

ఒక మహాయజ్ఞం లాంటి పనిని ఎలా చేశానో, ఎలా పూర్తి చేయగలిగానో తల్చుకుంటే నాకే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. ఇందుకు అవిరళంగా శ్రమించి ఏభై ఏళ్ళపైబడి శిథిలావస్థకు చేరుకుంటున్న 'బాల' పేజీలను అందంగా సంస్కరించి, తీర్చిదిద్దిన మా కంప్యూటర్ ఆపరేటర్లిద్దరి పనితనాన్ని అభినందించక తప్పదు మరి!

నా ఊహకు అందని రీతిలో ప్రచురణకు ముందుగా ఈ ప్రయత్నాన్ని హర్షించి, సంపుటిని కొనుగోలు చేసిన వందలాది (ఇంగ్లండ్, కెనడా, హాంగ్‌కాంగ్, అమెరికాల నుంచి కూడా) మంది బాలాభిమానులకు కృతజ్ఞతాభివందనాలు తెలియజేసుకోవడం నా విద్యుక్త ధర్మం! ఇందుకు ఇతర పత్రికలు కూడా ఉచితరీతిని ప్రచారం కల్పించి తోడ్పడడం విశేషం! వారందరి అపూర్వ ఆదరణే, కొంగ్రొత్త ఉత్సాహాన్నీ, ఆర్థికశక్తినీ ఇచ్చి, అనుకున్న విధంగా శ్రీ న్యాయపతి రాఘవరావుగారి శతజయంతి ముగింపు ఉత్సవంలో ఈ సంపుటిని ఆవిష్కరింపజేయడానికి మార్గం సుగమం చేసింది.

ఇప్పటిదాకా ఈ సంపుటిని తిలకించిన వారు అనేకానేక ఊళ్ళ నుంచి 'మంచిగా' స్పందించడం పడిన శ్రమను మరపింప జేస్తోంది. ఇలాంటిదే మరో ప్రయత్నం చేయబూనడానికి సరికొత్త ఆలోచనకు విత్తు నాటుతోంది. చూద్దాం!

శాయి

**150**

సంపుటి : 5
సంచిక : 2
మే : 2005

# రచన
ఇంటింటిపత్రిక

పేజీలు : 100
వెల : రూ. 20/-

ముఖచిత్రం : బాలలు ఆవిష్కరించిన 'బాల విహంగ వీక్షణ సంపుటి'

చిరునామా:1-9-286/3, విద్యానగర్ (రాంనగర్ గుండు దగ్గర), హైదరాబాద్-500044. ఫోన్:(ఆ):27071500 (ఇ): 27077599
*email : rachanapatrika@hotmail.com, talpasai@rachana.net* *www.rachana.net*

సంపాదకీయం..... 5

## కథలు

నిర్లక్ష్యం - డా॥ (శ్రీమతి) కొరారి వాణీచలపతిరావు ... 27
నాగానందం - ఎమ్మెస్వీ గంగరాజు ... 38
ఫుడ్ చైన్ - డా॥ మూలా రవికుమార్ ... 71
కథాప్రహేళిక :: డిటెక్టివ్ నీలూ - 'కరుణ' ... 74
కథాపీఠం :: ముంగిట్లో మందారాలు ... 85
- ఎస్. సుభాషిణి

## సీరియల్ రచనలు

ముత్యాల పందిరి - డా॥ పోరంకి దక్షిణామూర్తి... 12
ఇంత రక్తపాతం ఎందుకు? ... 19
బెంగాలీ: సమరేష్ మజుమ్‌దార్
తెలుగు : ఆర్.వి. లక్ష్మీదేవి
హౌస్ సర్జన్ - కొమ్మూరి వేణుగోపాలరావు... 43

## విశేష రచన

డా॥ సంజీవ్‌దేవ్ - డా॥ యస్వీ రామారావు ... 34

## శీర్షికలు

ఉత్తర రచన ... 6
పజిలింగ్ పజిల్ ... 8
నిర్వహణ: సత్యం మందపాటి
పజిలింగ్ పజిల్ - 147 ఫలితాలు ... 11
సాహితీవైద్యం - వసుంధర ... 80
అమృతవర్షిణి - కె.వి. రమణ ... 93
మూడు ప్రశ్నలు - ఒకే సమాధానం ... 95
పజిలింగ్ పజిల్ - 148 ఫలితాలు ... 96
రచనా సమీక్ష ... 97

## అక్కడక్కడక్కడా

కార్టూన్లు, అమెరికా కీలుబొమ్మ పదాలు -డా॥ వేద



## ఉత్తర రచన



**'బాల'** విహంగ వీక్షణసంపుటిని ప్రచురించాలన్న మీ ఆలోచన, చేస్తున్న ప్రయత్నం అభినందనీయం. 1973లో పుట్టిన నా లాంటి తరం వారికి, పాత తరం నాటి పుస్తకాలు, కథలు - ఇప్పుడు ప్రచురించి - అందించాలని మీరు పడుతున్న తపన - తెలుగు భాషాభివృద్ధికి చాలా తోడ్పడుతుందని నా అభిప్రాయం. నేను చిన్నప్పుడు చందమామ, బాలజ్యోతి, బొమ్మరిల్లు లాంటి కథల పుస్తకాలు చదివి - ఇంజనీరింగ్ చదువుతున్నప్పటి నుండి 'రచన' అభిమానిగా మారాను. ఈ మధ్య 'రచన' సంచికలలో 'బాల' గురించి చదివి - మీరు ఎన్నో వ్యయప్రయాసలతో ప్రచురించనున్న 'బాల విహంగ వీక్షణ సంపుటి' చదవాలని ఆశతో ఎదురుచూస్తున్నాను.

*- యం. సోమశేఖరరావు (ఇబ్రహీంపట్నం)*

తెలుగువారందరూ తప్పక చదివి, పత్రికలను సేకరించి దాచుకొనదగిన, తెనుగులోని తియ్యదనాలను పాఠకులకు తెలియ పరుస్తూ తెలుగు రచయితల ప్రతిభలను వెలికి తీస్తూ, ప్రోత్సాహపరుస్తూ, అమెరికాలోని తెలుగు వారికి తెలుగు నేలపై అడుగిడిన అనుభూతిని కలిగిస్తూ మాతృదేశంపై బెంగ కలిగేలా 'రచన' చదవగానే కొంత బెంగతీరేలా చేస్తూ మనం కనీసం తెలుగు సాహిత్యాన్ని మిస్ కావడం లేదనిపిస్తూ ప్రశంసలందు కుంటున్న ఏకైక తెలుగు పత్రిక 'రచన'. పత్రిక మొదలైన నాటి నుండీ చదువుతున్న అభిమానిని నేను. ఇందులోనే ఒకప్పటి రచయితలు, పానుగంటి - మునిమాణిక్యం, చిలకమర్తి మొదలైన వారి కథలను నవలలను సీరియల్స్‌గా ప్రచురిస్తే ఈనాటి పాఠకులకు వారి గురించి ముఖ్యంగా యువతరానికి మరుగున పడినా విలువ తగ్గని తెలుగు సాహిత్యం చదివే అవకాశం కలిగించి తెలుగు వారికి సాహిత్యం పట్ల సమగ్రమైన అవగాహన కలిగేలా చేసిన ఘనత రచనకే దక్కగలదు. నేను వ్రాసిన రచయితల పేర్లు కాక అటువంటి వారెంతమందో ఉన్నారు. కాబట్టి నా ఈ సూచనని గ్రహించగలరనవి ఆశిస్తున్నాను.

*- బి.ఎం. అంబిక (వైజాగ్)*

'ఫర్ ఓల్డ్ మెన్' కథకు ఇంగ్లీషు టైటిల్ ఎందుకు పెట్టినట్లు? ఆ భావము వచ్చే తెలుగు మాటలేదా? కథ చదువుతూన్నంత సేపు ముసలితనం ప్రతి జీవి అనుభవించేదేనూ కాబట్టి ధైర్యంగా ఎదురుచూడాలి. ముందు చూపు మంచిది. బిడ్డలు మనలను ఆదుకుంటారని మన చేతిలో ఉన్నదంతా వాండ్లకు ఇచ్చి వాండ్లను పై అంతస్థు ఎక్కించి చూచి సంతోషపడడం సరికాదు. వాండ్లు ప్రయోజకు లయ్యే దారి చూపించాలి. కష్టపడి పైకి వచ్చే నేర్పు వస్తే చాలు. మన సంపాదనలో కొంత ముసలితనంలో ఉపయోగపడేందుకు ప్రతి మనిషి ఆలోచించి అడుగు లేసి జాగ్రత్త పడాలి నిర్లక్ష్యంగాను బిడ్డలే చూస్తారులే, ఎవరి కోసం చూడరు? మనవల్ల వాండ్లు పైకి వచ్చారు. మన బాధ్యత మనం చేసాము. వాండ్ల బాధ్యత వాండ్లు చేయాలి అంటూ ఏవో పిచ్చి ఆలోచనలతో మనకున్న అవకాశాలను, బిడ్డల మీదుండే విపరీత ప్రేమతో వాండ్లపై భారం, బాధ్యత, పెట్టి సోమరిగా ప్రవర్తించడం సమంజసం కాదు. ప్రతి మనిషి తన జీవితాన్ని మంచి మార్గాన నడిపించి మంచి కుటుంబమునకు మంచి పౌరుడుగా దేశమాతకు పేరు తేవాలి. ఇంకా తెలివైన పని ప్రక్కవాడికి, బీదవాడికి చేతనైన సహాయం చేయాలి. దేశం నాకేమి ఇచ్చింది? అని ప్రశ్నించడం కాదు. దేశం కోసం మన మేమి చేశాము? అని ప్రశ్నిం చుకోవాలి ప్రతి మానవుడు. నాకు తెలిసినంత వరకు ప్రతి కుటుంబంలోనూ పెద్ద కొడుకుగా ఉండి చలామణి అయ్యేవాడు దూరదురాలోచనలతో స్వార్థంతోను వ్యవహరిచడం చూచాను. మొత్తం కుటుంబంలో ఉన్న మిగిలిన వాండ్లను పెంచి పెద్ద చేసి అందరి జీవితాలు సన్మార్గంలో నడిచే రీతి అలవాటు చేయాల్సినది పోయి తన స్వార్థ చింతతో ఇంతమందిని - అంటే నలుగురు తమ్ములు, నలుగురు చెల్లెండ్లనూ - గాలికి వదిలివేస్తే అది తనకు ముందుముందు మంచి జరగదేమో? అనే సందేహం రావాలి. భయం, పాపచింతన, దైవభక్తి, మొదలైన ఆలోచనలు మనస్సుకు రావాలి. నాకు తెలిసిన కుటుంబాలు పెద్ద కొడుకుల స్వార్థానికి బాగానే బలి అయినవి చూచాను. నా మనస్సుకు వచ్చినదంతా రాశాను. మీ అభిప్రాయం తెలుపండి పత్రికాముఖంగా.

జోడు-తోడు: రచయిత 'కేసరి' : మంచికథ, మనస్సుకు బాధ కలిగించింది. లోతుగా ఆలోచించేదిగా ఉంది. ఆ తండ్రి హృదయంలో పొంగిన వేదన మా కండ్లల్లో నీరూరించింది. హేట్సాఫ్ టు మీకు మరియు రచయితగారికి తెలుపుకుంటున్నాను. కథకు టైటిల్ బాగా నప్పింది. ఆడ, మొగ అంటే భార్య, భర్త ఎవరో ఒకరు ముందు, వెనుకగా అందరమూ పోయేదేను. సాధారణంగా ఆడవాండ్లకుండే మనోధైర్యం, మెచ్యూరిటీ థింకింగు మొగవాండ్లకు తక్కువే అంటే వప్పుకుంటారా? స్వార్థం కూడా ఎక్కువే. నా మాట జరగాలి అనే మొండితనము, పిడివాదంతో మొత్తం కుటుంబాన్ని బాధిస్తున్నామనే జ్ఞానం కూడా తక్కువే. అన్ని రకాలుగా యోచన చేసి సరైన నిర్ణయాలు చేయడం చాలా మంది ఆడవాండ్లకు తెలుసు. తిరిగి ఆడపెత్తనం అని ఎగతాళి చేయడం చేస్తారు. కొంతమంది మొగవాండ్లు. భార్య పోయిన 2, 3 నెలలకంతా పెండ్లికి తయారు. చూస్తూంటే వెగటు, అసహ్యం కలుగుతుంది. లోకంలో నలగురూ ఏమనుకుంటారు? ఇన్నేండ్ల బంధం మర్చిపోయి పెండ్లికి సిద్ధపడడం, ఏదో రకంగా సమర్థించుకోవడం ఈ లోకంలో మామూలే! అందరూ అట్లా ఉంటారని కాదు. మెజారిటీ మొగవాండ్లు అదే! చిన్న వయసు ముగ్గురు నలుగురు పిల్లలున్న మహిళ ఎంతో దూరం ఆలోచిస్తుంది. లేని పోని బెడద, ఆ వచ్చే వాడు ఈ పిల్లలను సరిగా చూడకపోతే? అనే సమస్య గురించి ప్రధానంగా యోచన చేస్తూ కాలయాపన, కొట్టుమిట్టుకుంటూ సగం మనస్సుతో కలవరపడుతుంది. ఈ కథలో శేషగిరి రాజస్థాన్ బదిలీ మీద వెళ్ళి జబ్బు పడి చూచే దిక్కులేక ఎదురింటివాండ్ల సహాయం తీస్కుని అట్లా స్నేహం పెంచుకున్నట్లు వ్రాశాడు. అట్లా కాక ట్రాన్స్‌ఫర్‌కు ప్రయత్నించి లేదా కూతురు, అల్లుడు సహాయం కోరడం, సెలవులో వెళ్ళి బాగైనాక జాబ్‌లో చేరడం, అట్లా మలుపు తిప్పి ఉంటే బాగుండేది. ఎట్లాగూ ఆడతోడు, భోజనం, ఇల్లు అన్నీ కావాలి శేషగిరికి. ఈ కథ అట్లా దారి పట్టింది. అన్నీ కుదిరాక, కూతురు, మనువలు జ్ఞాపకం వచ్చారు. ఆ పెండ్లి కూడా వాండ్ల అనుమతితో చేసుకుంటే బాగుండేది. ఇటు కూతురు, మనుమలు సంతోషపడేవాండ్లు. ఇంకో రకం మొగవాండ్లు త్రాగుబోతులు, వాండ్లకు భార్య, బిడ్డలు పట్టనే పట్టరు. నిండా మునిగిన వానికి చలేమిటి? అన్న తీరున ఇల్లు, వళ్ళు గుల్ల. ఇంక మామగారి మీద చిందులు, ఆస్తి, డబ్బుకై పిల్లనిచ్చినందుకు ఆ తండ్రి పాట్లు

భగవంతుడికే తెలియాలి. మధ్య తరగతి కంటే క్రింది తరగతి వాండ్లు రిక్షా, ఆటో, కూలి పనులు, తాపీ పనులుతో జీవించేవాండ్లుకు చదువు తక్కువ ఆదాయం అంతంత మాత్రమే. మరి అట్లాంటప్పుడు త్రాగుడు, జూదం, లాటరీలు, ఇట్లా చెడ్డ వ్యసనాలకు అలవాటుపడితే వాండ్లకు సుఖం ఉండదు. జీవితాంతము ఆడవాండ్లు, పిల్లలు కాయ కష్టం పడుతు ఎదుగు బొదుగు లేని జీవితాలకు వారసులుగాక మరింకేమిటి? పిల్లలకు బాల్యం నుండి చాకిరీ, నౌకరీ, వెట్టిచాకిరీ, తప్పవు.

ఇంక ''వసుంధర'' పేరుతో చాలా ఆర్టికల్సు చదివాము. "ఎవరామె?" లేక కలం పేరా? ఈ.టి.వి.లో కూడా సీరియల్స్ ప్రసారమవుతాయి. ఎవరో తెలియదు మాకు. తెలుపుతారా?

*- దరిశి సత్యవతి (నాగ్‌పూర్)*

"బాల" పత్రికల ముఖచిత్రంతో వెలువడిన ఏప్రిల్ 'రచన' సరదాగా మనస్సులను రంజింపచేసింది.

రేడియో అన్నయ్య, బాలన్నయ్య గారి శతజయంతి ఉత్సవం సందర్భంగా "బాల విహంగ వీక్షణ సంపుటి" ఆవిష్కరణ అని చదవగానే, విహంగవీక్షణని కొని తీరాలని నిశ్చయించుకున్నాను. ''బాలన్నయ్యకు జేజేలు" పదే పదే చదివాను. అది చదవగానే నేను కూడా నా బాల్య స్మృతులలోకి వెళ్ళిపోయాను. ఆ రోజుల్లో పిల్లల ప్రోగ్రాములు నేను కూడా పాల్గొనేదాన్ని. అలా బాలన్నయ్యగారితో కొద్దిపాటి పరిచయం. అప్పట్లో 'బాల' మాసపత్రిక (ఇప్పటి 'రచన' లాగానే) క్రమం తప్పకుండా కొని చదివేదానిని. ఈ వ్యాసం చదువుతుంటే ఆనాటి తీపి జ్ఞాపకాలు కళ్ల ముందు మెదిలాయి.

ఈ మధ్య పిల్లలు అమెరికా నుంచి రావడం వల్ల మూడు నెలల (జనవరి, ఫిబ్రవరి, మార్చి) సంచికలు పదిలంగా దాచుకుని మెల్లిగా ఇప్పుడే వాళ్ళు వెళ్ళాక చదవడం పూర్తిచేసాను. "పిల్లలకే స్వరాజ్యం వస్తే" - బాపుగారి కార్టూన్లు ఆనందాన్ని పంచాయి. 'రచన' రాగానే నేను చేసేది పజిలింగ్ పజిల్ చూడడం ఎప్పటికైనా దాన్ని ఆల్ కరెక్టుగా పూర్తి చేయాలనే నా ఆశ ఎప్పటికి నెరవేరుతుందో చూడాలి. కథాపీఠంలోనూ, కథా ప్రహేళికలోనూ వస్తున్న కథలు బాగుంటున్నాయి. ఎంతైనా రచన నాకు నెలంతా కాలక్షేపం ఇచ్చే తోడు స్నేహితుడు.

*- వేదుల పార్వతి (హైదరాబాద్)*

ఎప్పుడో చిన్నతనంలో చదివిన 'ముత్యాల పందిరి' సీరియల్ నవల తిరిగి ఈనాడు చదువుకునే వీలు కలిగించిన 'రచన' సంపాదకులకు ధన్యవాదాలు. అలాగే, బలివాడ కాంతారావు గారి 'సంపంగి' చదువు కునే వీలు కల్పించగలరేమో ఆలోచించండి.

*- ఎమ్మెస్వీ గంగరాజు (బరంపురం)*

మధుర సుందరి కాంచనమాల స్మృతులు మమ్మెలను అలరించింది. కార్టూన్లు బాగున్నాయి. శాయిగారు కూపన్ల భారం తగ్గించండి. బాలన్నయ్యకు జేజేలు. హృదయ భరిత అంశం బాగుంది - మరుగున పడిని ఉత్తమ కథల, చిత్రాలు అంశాలు, వేయడం ముదావహం. చందమామ కన్నా 'సీనియర్' బాల అంశాలు బాగున్నాయి. అంత ఖరీదు పెట్టి "బాల సంపుటి" కొనగలమా?"

*- వాస్తు రామచంద్ర (నెల్లూరు)*

'రచన ఒక వ్యసనం' కథ - బాలకృష్ణుడు తన చిన్న నోటిలో సమస్త లోకాలను చూపి యశోధను ఆశ్చర్యపరిచాడు. వ్యాపకం, వ్యసనం, సంపాదకునికి ఉత్తరం, రచన - యిలా ఎన్నో విషయాలను సింగిల్ పేజీ కథలో పొందుపరచి, హాస్యం జోడించి సులభశైలిలో రచయిత చెప్పారు. ఇందలి విషయాలు చాలామందికి అనుభవపూర్వకంగా తెలుసు. పదవీ విరమణ తర్వాత చిన్ననాటి వ్యాపకాలను మరల ప్రారంభించడానికి స్ఫూర్తినిచ్చింది 'రచన' మాసపత్రిక అనేది నిజం. పజిల్ చేతిలో వుంటే కాలం ఎలా గడిచిపోతుందో తెలియదు. కథా ప్రహేళిక కథకు విశ్లేషణ రాయటానికి, మన మనోభావాలను వ్రాసి పత్రికకు పంపాలనే తపన మనకు మంచి వ్యాపకం. వయసు, పరిస్థితులు అనుకూలించకపోయినా ఎలాగో పూర్తి చేయాలనే తపన మనస్సుకు ఎంతో వుత్సాహం కలిగిస్తుంది. ఇతరులకు యిబ్బంది లేని, మనకు ఆనందాన్నిచ్చే యీ వ్యసనం మానసిక ఆరోగ్యానికి మంచిదే. ఎటొచ్చీ మనకు కాస్త ఆర్థిక స్వాతంత్రం అవసరం. రచయితకు ధన్యవాదాలు.

*- ఆర్. ఇంద్రావతి (విజయవాడ)*

"స్మృతి" ద్వారా కర్మయోగి వై. తారక్‌నాథ్ గారి పరిచయం మమ్మల్ని ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఈకాలంలో కూడా తన సుఖం తను చూసుకోకుండా ఇతరుల కోసం పాటు పడే వాళ్ళు ఉన్నారా అని అనిపించింది. హేట్సాఫ్ టు తారక్‌నాథ్. వారు నిజంగా చిరస్మరణీయులు. బ్యాంక్ ఉద్యోగులు అని చెప్పవచ్చు. వారిని మాకు రచన ద్వారా పరిచయం చేసిన మీరు బహుదా అభినందనీయులు. కొమ్మూరి వేణుగోపాల్‌రావు గారి సీరియల్ "హౌస్‌సర్జన్" కడు రమ్యంగా ఉంది. విడువకుండా చదవాలనే కుతూహలం కలిగిస్తుంది.

సిరివెన్నెల సీతారామశాస్త్రిగారి 'సెలయేరు లాంటి సముద్రం' నవలపై వారు వివరించిన ప్రతి మాటా ఓ వజ్రపు తునకలా వుంది. మా హృదయాలను ఆకట్టుకుంది. వారు చివరగా చెప్పిన నాలుగు చరణాలు అత్యద్భుతంగా ఉన్నాయి.

*-కరణం శివానందరావు (కర్నూలు)*

'రచన' ప్రతి సంచికా దాచుకోదగిన సంచికగా రూపొందుతుండడం సంతోషదాయకం. అయితే పోటీలకు సంబంధించి నా అభిప్రాయాల్ని వ్యక్తం చేయదలిచాను. అవేమిటంటే - ప్రతి సంచికలోనూ ఆరు పోటీ కూపన్లు ప్రచురిస్తున్నారు. అంటే ఆరు రకాల పోటీలను నిర్వహిస్తున్నారన్న మాట. కానిందులో 'సాహితీవైద్యం', 'నా అభిప్రాయం', 'నేను మెచ్చిన కథ"లు పోటీలు కావు. అయినప్పటికీ వాటిలో పాల్గొనాలంఏ, కూపనును జతచేయమనడం మీ దృష్ట్యా సమంజసమే. అయితే పోటీ కూపన్లని అనగూడదేమో వాటిని. కూపన్లంటే చాలదా?

ఇంకా ప్రతి సంచికలోనూ పజిలింగ్ పజిల్, మూ.ప్ర.- ఒ.స., సాహితీవైద్యాలే అగుపిస్తుంటాయి గాని మిగతావి అగుపించవు. అలాంటప్పుడు మిగతా మూడింట్లో పాల్గొన్న వారికి కొంత అసంతృప్తి కలక్క మానదు. పరీక్షలైన వెంటనే ఫలితాలొస్తే ఎంత బాగుంటుందో, పోటీలు నిర్వహించిన వెంటనే ఫలితాలను ప్రకటించి, ప్రచురిస్తే అంత బాగుంటుందని నా భావన. ఐదారు సంచికల ఫలితాలను ఒకసారి కల్పి ప్రకటించి, ప్రచురిస్తే ఆనాటికి పోటీల్లో పాల్గొన్న వారు వారి వారి జ్ఞాపకాల పొరల్లోంచి వారు పాల్గొన్న విషయాన్ని, రచించిన రచనల్ని దూరం చేసుకుని ఉంటారనడంలో సందేహం లేదు. కనుక మిమ్మల్ని విన్నవించుకొనేదేమంటే ప్రతి సంచికలోనూ ఈ ఆరు రకాల అంశాల్ని ప్రచురించేలా చూడండి. అవసరమైతే వీటి కోసం ఓ కథను తగ్గించినా ఫర్వాలేదని నా భావన.

*- దేవరం సంతోష్‌కుమార్ (జగిత్యాల)*

*వచ్చే సంచికలో....*

**సత్యజిత్‌రాయ్ కథ**

## ఇద్దరు మెజీషియన్లు

# అమృత  వర్షిణి

కె.వి. రమణ

## అతిథి దేవోభవ

**'తిం**టే గారెలు తినాలి - వింటే భారతమే వినాలి' అని పెద్దలు ఊరకనే అనలేదు. మహాభారతంలో పాండవులు, కౌరవుల వృత్తాంతమే గాక ఎన్నో కథలు, ఉప కథలు, నీతి కథలు, సూక్తులున్నాయి.

కర్ణుడు లేనిదే భారతం లేదు. కర్ణుడికి దానకర్ణుడన్నది ప్రతీతి. దానకర్ణుడన్న ప్రసిద్ధికి ఈర్ష్యపడిన దుర్యోధనుడు తాను కూడా దాతగా పేరు పొందాలనుకున్నాడు. అతిథిని దేవుడిగా భావించే గుణం సహజ సిద్ధంగా కర్ణునికి వుంటే, దుర్యోధనుడు తనకు దాతగా పేరూ, ప్రతిష్ఠలు రావాలను కున్నాడు.

అది వానలెక్కువగా పడుతూన్న కాలం - అతివృష్టి - ఒక బ్రాహ్మణుడు అతిథిగా వచ్చి తాను చేస్తూన్న యజ్ఞానికి బండెడు ఎండిన సమిధలు - కట్టెలు - కావాలని అడిగాడు. దుర్యోధనుడు ఎంతో విన యంగా "అయ్యా! వర్షాకాలమిది! పైగా అతివృష్టి!! వానలెక్కువ పడుతూండడం వల్ల కట్టెలన్నీ తడిసిపోయినాయి కదా! మీ యజ్ఞానికి కావల్సిన ఎండు కట్టెలని ఇప్పటి కిప్పుడు ఎక్కడినుండి తేను? వర్షాకాలంలో కాకుండా మరో కాలంలో మీ యజ్ఞానికి తోడ్పడతాను. ఇప్పుడైతే దొరకవండీ" అని వచ్చిన ఆ బ్రాహ్మణుడికి ఏమీ ఇవ్వలేదు.

ఆ బ్రాహ్మణుడు వెంటనే దుర్యోధనుని ప్రక్కనే వున్న కర్ణున్ని అతిథిగా అర్థించాడు.

'అతిథి దేవోభవ' అనుకొన్న కర్ణుడు వర్షాకాలమని వెనకాడలేదు. అతివృష్టియని విచారించలేదు. సమయాసమయములను, సాధ్యాసాధ్యాలను లెక్కించని కర్ణుడు అడిగి నదే తడవుగా తాను నివసిస్తూన్న ఇంటినే పడగొట్టి రెండు బండ్ల కట్టెలనిచ్చి సమిధ లుగా వాడుకొమ్మని ఆ అతిథిని సంతృప్తి పరచాడు.

మరో సందర్భంలో కర్ణుడు స్వగృహ



ములో నవరత్న ఖచితమగు బంగారు పాత్రలోని నూనెతో తలంటుకొనుచుండగా శ్రీకృష్ణుడు వచ్చి ఆ పాత్ర తనకు కావలెనని అడగగానే - కుడిచేత్తో తలంటుకొంటున్నం దున ఎడమచేత్తో ఆ బంగరు పాత్రను శ్రీకృష్ణునికిచ్చాడు.

# పాత 'రచన'లు పొందే విధానం

**చా**లా కాలంగా కొత్తగా చేరుతున్న చందాదారులైతేనేమి, పాత పాఠకులైతేనేమి, పాత సంచికల కొరకు తరచుగా రాస్తున్నారు. ఇలా పాత సంచికలు అవసరమైన రచనాభిమానుల సౌకర్యార్థం మా దగ్గిర స్టాకు ఉన్నంతవరకూ చక్కగా బైండ్స్‌గా తయారు చేయించడం జరిగింది. ఆ వివరాలు :

| బైండ్ నెం | సంచికలు | | వెల | | బరువు | పోస్టేజి | రిజిస్ట్రేషన్ |
|---|---|---|---|---|---|---|---|
| 12. | జన్మదిన ప్రతిష్ఠాత్మక సంచిక '99 | 5 | రు. 90/- | US $ 30 | 750గ్రా | రు.23/- | రు. 17/- |
| 15. | మార్చి '00 నుండి డిసెంబర్ '00 | 8 | రు. 150/- | US $ 48 | 1250గ్రా | రు.38/- | రు. 17/- |
| 16. | ఏప్రిల్ '01 నుండి డిసెంబర్ '01 *(2001 జన్మదిన ప్రత్యేక సంచికతో సహా)* | 11 | రు. 190/- | US $ 60 | 1250గ్రా | రు.38/- | రు. 17/- |
| 17. | జనవరి '02 - డిసెంబర్ '02 (దీపావళి ప్రత్యేక సంచికతో సహా) | 13 | రు. 260/- | US $ 54 | 1500గ్రా | రు.54/- | రు. 17/- |
| 18. | జనవరి '03 - డిసెంబర్ '03 | 13 | రు. 260/- | US $ 54 | 1500గ్రా | రు.54/- | రు. 17/- |
| 19. | జనవరి '04 - డిసెంబర్ '04 | 13 | రు. 260/- | US $ 54 | 1500గ్రా | రు.54/- | రు. 17/- |

పాత సంచికల బైండ్స్ ధరని అందులో ఉన్న సంచికలను బట్టి నిర్ణయించడం జరిగింది. ఇటీవల కాలంలో పోస్టలు రేట్లు అనూహ్యంగా పెరిగిన కారణంగా, బైండ్స్ ధరకు పోస్టలు చార్జీలు కలిపి పంపాల్సి ఉంటుంది. మూడు బైండ్స్‌కి తక్కువ కాకుండా తెప్పించుకునే వారికి రిజిస్ట్రేషన్ ఖర్చులు 'రచన' భరిస్తుంది.

పాత సంచికలు కావలిసిన వారు ఆ బైండ్స్ ఖరీదును మనిఆర్డరు/డిమాండ్ డ్రాఫ్ట్ **(Drawn in favour of 'RACHANA' payable at 'HYDERABAD')** ద్వారా పంపితే తిరుగు టపాలో రిజిస్టర్ పోస్టు ద్వారా పంపగలము. ఈ అవకాశం కొద్దిగా ఉన్న స్టాకు అయిపోయేటంతవరకు మాత్రమేనని గమనించగలరు.

"కర్ణా ఎడమ చేత్తోనా నాకు సమర్పించుట! నీకు శిష్టాచారము తెలియదా?" అని శ్రీకృష్ణుడు ప్రశ్నిస్తాడు.

కర్ణుడు వెంటనే, "క్షణం చిత్తం క్షణం విత్తం క్షణం జీవితమావయోః" అని అంటాడు.

"కుడి, ఎడమల భేదం లేక ఇమ్ము, ఇమ్ము అన్నదే జీవిత రహస్యం. కృష్ణా, ఇప్పుడున్న మనస్సుగానీ, ఇప్పుడున్న ధనంగానీ, ఇప్పుడున్న జీవితంగానీ ఉత్తర క్షణాన మాయమై పోవచ్చు. నూనెతో కూడుకొన్న ఈ కుడిచేతిని కడుక్కొని ఆ చేత్తో నీకు ఆ పాత్ర నిచ్చేలోపల నా బుద్ధి ఏమి మారిపోవునో? జీవుల ధర్మబుద్ధి త్వరితగతిని మార్పు చెందుచుండును. అంతవరకు నా జీవితముందునో లేదోయని విచికిత్స కలిగి ఎడమ చేత్తో నీకిచ్చి వేయాలను కొన్నాను. అంతేగానీ, శిష్టాచారము తెలియకకా"దని సమాధాన మిచ్చాడు.

ఆతిథ్యమిచ్చునప్పుడు ఆత్మీయత, అధ్యాత్మ భావ పరిపూర్ణత అవసరమన్న విషయం కర్ణుని మాటల ద్వారా మనకు ద్యోతకమవుతుంది.

'తేన త్యక్తేన భుంజీథాః" – ఏ వస్తువు నైనా త్యాగం చేస్తూ, మిగిలినదాన్ని భుజించండి అన్నది వేదం.

'కేవలాదీ కేవలాఘో భవతి' – ఎవనికి పెట్టకుండా తినే వ్యక్తి, పాపాన్నే భుజిస్తు న్నాడని శ్రుతి పలుకుతున్నది.

'నిత్యం పంక్తి భోజనం కుర్యాత్' – ప్రతి దినం కొందరితో కలిసి భుజంచాలన్నది గృహస్థుల ధర్మాన్ని బోధించే ఆర్ష వాక్యం.

అతిథినాదరించాలన్నది భారతీయ తత్త్వం. సక్తుప్రస్థుడు బలి చక్రవర్తి. రంతిదేవులు అతిథులనాదరించటంలో 'అన్నగతజీవులైన ప్రాణులు – ప్రాణ త్యాగానికైనా సంసిద్ధమేనన్న సిద్ధాంతానికి' తార్కాణంగా చరిత్రలో ఆచంద్ర తారార్కం నిల్చిపోతారు. అందుకే మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథి దేవోభవ అన్నది ఉపనిషత్తు. మనందరం సహృదయులమై పనులనూ, అనుభవాలనూ పదిమందితో సమానంగా పంచుకోవాలి. జీవితం క్షణభంగురమని తెలిసి ధర్మాన్ని ఆచరించడం మనందరి కర్తవ్యం. ❀




**మా**ట్లాడు తెలుగేషు
పనిలోన బహుభేషు
ఆంధ్రుడి కమామీషు
ఓ కీలుబొమ్మా!